సాక్షి మంచిర్యాల

గురువారం । 5 । అక్టోబర్ । 2023



అభివృద్ధికి నిధుల వరద

ప్రజావసరాల అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధుల వరద పారిస్తోందని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. నియోజకవర్గంలో పలు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. IIIలో▸

9 నుంచి సదరం శిబిరాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 9 నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి తెలిపారు. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శిబిరానికి హాజరు కావాలని, సదరం సర్టిఫికెట్ కాలపరిమితి పూర్తయిన, నూతన పత్రం పొందవచ్చని తెలిపారు. 9న మూగ చెవుడు, 13న శారీరక వికలాంగులు, ఆర్థో, 19న కంటి చూపు, 26న మానసిక వికలాంగుల సదరం శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
34.0 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జడ్జి నిరోషకు సన్మానం



జడ్జి నిరోషను సన్మానిస్తున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా నియామకమై బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తి నిరోషను స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఉదయ్‌కుమార్, ఉపనిషధ్వని, మారం అర్పితరెడ్డి, అజయ్ ఉల్లమ్ మాట్లాడుతూ న్యాయమూర్తిగా తొలి పోస్టింగ్ మంచిర్యాలకు రావడం అభినందనీయమని కొనియాడారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగు మల్లేష్, ఉపాధ్యక్షుడు టీ.అనిల్‌రాజ్, న్యాయవాదులు కాటుకూరి గంగయ్య, సాగర్, సునిల్ శాంతికుమార్, లక్ష్మీనారాయణ, మహిళా న్యాయవాదులు మాధవి, శైలజ, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్



రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న ప్రవీణ్

బెల్లంపల్లి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా బెల్లంపల్లికి చెందిన రేణికుంట్ల ప్రవీణ్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం హైదరాబాద్ పరిశ్రమల భవన్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు రావుల శ్రీధర్‌రెడ్డి, ఎర్రోల్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, శ్రీధర్, బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

352 మంది ఎస్‌ఏల బదిలీ

మంచిర్యాలఅర్బన్: బదిలీల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని 352 మంది స్కూల్ అసిస్టెంట్ల(ఎస్‌ఏ)కు స్థాన చలనం కలిగింది. ఇందులో లోకల్ బాడీలో 322, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు 30 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందజేశారు. బదిలీ అయ్యే ఉపాధ్యాయుడు పనిచేసే పాఠశాలకు రిలీవర్ వస్తేనే రిలీవ్ చేయాలనే మెలికపెట్టడం సంతోషం లేకుండా చేస్తోంది. ఒక పాఠశాలల్లో రెండు పోస్టులు ఉండి ఇద్దరికీ బదిలీ జరిగి వారి స్థానంలో ఒకే రిలీవర్ వస్తే సీనియర్ ఉపాధ్యాయుడిని రిలీవ్ చేయాలని తెలిపింది. బదిలీ స్థానంలో మరొకరు వచ్చినప్పుడే విడుదల చేయాలని, విద్యార్థుల సంఖ్యకు అదనంగా ఆ పోస్టు ఉంటే సీనియర్‌ను విడుదల చేయొచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే

కాసిపేట: క్రీడారంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రి, మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతకు చదువుతోపాటు మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ఎంపీపీ రొడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చెంద్రయ్య, ఎంపీడీవో ఎంఏ అలీం, ఎంపీవో నాగరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ కోసం రాస్తారోకో




రాస్తారోకో చేస్తున్న స్థానికులు

జన్నారం: జన్నారం మండలానికి 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 39 రోజులుగా సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి చేపట్టిన రిలే దీక్షలకు మద్దతుగా మండల కేంద్రానికి చెందిన వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, పార్టీల నాయకులు రోడ్డెక్కారు. ప్రధాన రహదారిపై గంటపాటు రాస్తారకో చేశారు. లోవోల్టేజీతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, బీజేపీ అధ్యక్షుడు గోలి చందు, సీపీఐ కార్యదర్శి తిరుపతి, నాయకులు విజయ్, అజార్, రామచంద్రం పాల్గొన్నారు. కాగా, రిలేదీక్షకు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మద్దతు ప్రకటించారు.

మహిళా ఓటర్లే అధికం!

- జిల్లాలో మొత్తం ఓటర్లు 6.17లక్షలు
- తుది జాబితాలో 27,281మంది పెరుగుదల

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్యనే కాస్త ఎక్కువగా ఉంది. మూడు నియోజకవర్గాల్లోనూ పురుషుల సంఖ్య కంటే అధికంగా ఉంది. గత ఆగస్టు 21న ప్రత్యేక సమ్మరీ రివిజన్ పేరుతో ఎన్నికల సంఘం ఓటరు ముసాయిదాను ప్రచురించింది. దీనిపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు మరోసారి అవకాశం కల్పించింది. చివరికి బుధవారం తుది ఓటరు జాబితా ప్రచురించింది. దీని ప్రకారం జిల్లాలో మొత్తం 6,17,901 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,08,630 మంది, మహిళలు 3,09,229 మంది ఓటర్లు ఉన్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో మహిళల సంఖ్యనే ఎక్కువగా కనిపిస్తోంది. మొత్తంగా జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 601 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలో ఓటరు సవరణల కంటే ముందు మొత్తం 5,90,620 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 6,17,701మందికి చేరారు. అంటే తుది జాబితా నాటికి 27,281 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో ఎక్కువగా కొత్త ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా మంచిర్యాల మండలంలో 91,841 మంది ఉండగా, భీమిని పరిధిలో అత్యల్పంగా 8,314 మందే ఉన్నారు. గత రెండు నెలలుగా జిల్లాలో ఓటరు నమోదు, చేర్పులు, మార్పులపై విస్తృతంగా ప్రచారం చేశారు. అక్టోబర్ ఒకటి నాటికి 18ఏళ్లు నిండిన యువత ఓటరు నమోదుపై ఆసక్తి చూపారు. ఫాం 6, 7, 8 దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోగా, అందరికీ ఓటు హక్కు కల్పించారు. ఆన్‌లైన్‌లో ఓటరుగా ఇంకా నమోదు చేసుకునే అవకాశం ఉంది.



జిల్లాలో వయస్సుల వారీగా ఓటర్లు

వయస్సు	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జెండర్లు
18-9	9141	6660	01
20-29	63728	59636	18
30-39	88335	83829	12
40-49	58975	61900	03
50-59	43047	50266	03
60-69	30032	28160	04
70-79	12395	14143	01
80-89	2617	4006	0
90-99	329	596	0
100-109	29	32	0
110-119	-	-	-
120పైబడిన	02	01	0

మండలాల వారీగా..

మండలం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం	ఎన్ఆర్ఐ
దండేపల్లి	19607	20311	1	39919	16
లక్సెట్టిపేట	19970	20987	1	40958	-
హాజీపూర్	13004	13173	-	26177	-
మంచిర్యాల	45780	46052	9	91841	-
నస్పూర్	33510	31769	12	65291	-
కాసిపేట	13173	12948	4	26125	-
బెల్లంపల్లి	30965	31603	7	62575	-
తాండూరు	13155	13014	-	26169	-
కన్నెపల్లి	6680	6804	-	13484	-
భీమిని	4280	4033	1	8314	-
వేమనపల్లి	7276	7229	-	14505	-
నెన్నెల	9261	9165	-	18426	-
మందమర్రి	37669	37755	4	75428	-
జైపూర్	14258	13994	1	28253	-
భీమారం	6172	6286	-	12458	-
చెన్నూరు	21304	21534	-	42838	-
కోటపల్లి	12566	12572	2	25140	-

జిల్లాలో దివ్యాంగ ఓటర్లు

నియోజకవర్గం	అంధులు	మూగ,చెవిటి	నడవలేనివారు	ఇతర
చెన్నూరు	580	606	1706	255
బెల్లంపల్లి	521	437	1534	183
మంచిర్యాల	863	765	2045	697



నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం	ఎన్ఆర్ఐ	సర్వీసు
మంచిర్యాల	131871	132292	23	264186	21	333
చెన్నూరు	91967	92141	07	184117	06	133
బెల్లంపల్లి	84790	84796	12	169598	02	161
మొత్తం	308630	309229	42	617901	29	627

ఆస్పత్రి భవనాన్ని పరిశీలించిన విప్



భవనాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ సుమన్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో రూ.10 కోట్లతో నిర్మించిన 50 పడకల ఆస్పత్రి భవనాన్ని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పరిశీలించారు. త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో బుధవారం అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, అరవింద్, చెన్నూర్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వైద్యులు ఫయాజ్, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు



ప్రశ్నపత్రాలు అందజేస్తున్న కార్యదర్శి భీంరావు

మంచిర్యాలఅర్బన్: పిల్లల ప్రగతిని అంచనా వేసే సంగ్రహాత్మక మూల్యాంకన(ఎస్ఏ-1) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. పాఠశాలలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను మండల విద్యావనరుల కేంద్రం, పంపిణీ కేంద్రంలో అందుబాటులో ఉంచారు. ఒకటి నుంచి ఐదో తరగతిలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు బుధవారం ఎమ్మార్సీ కేంద్రం నుంచి ప్రశ్నపత్రాలు అందజేశారు. టైంటేబుల్‌ను అనుసరించి పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 21,427 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 29,487 మంది, ప్రైవేటులో 19,715మంది పరీక్షలు రాయనున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఏ రోజు పరీక్ష ఉంటే ఆ రోజు ప్రశ్నపత్రాన్ని ఉదయం 8గంటలకు పంపిణీ కేంద్రం నుంచి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

కార్యదర్శులకు నోటీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని 30 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విద్యుత్ చార్జీలు, మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ కిస్తీలు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు డీపీఓ వెంకటేశ్వర్ రావు క్షేత్రస్థాయి పర్యటనలో తేలింది. చెన్నూర్, వేమనపల్లి, కోటపల్లి, మందమర్రి, కాసిపేట, నెన్నెల మండలాలకు చెందిన 30 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు.

కార్యదర్శిపై డీపీఓకు ఫిర్యాదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ కార్యదర్శిపై సర్పంచ్ మట్టపల్లి మంజుల బుధవారం డీపీఓ వెంకటేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శి స్వరూప గ్రామ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రాజకీయ సమస్యలు సృష్టిస్తోందని ఆరోపించారు. కొంత మొత్తం ముట్టజెప్పితే గానీ ఎన్ఓసీ సర్టిఫికెట్లు జారీ చేయడం లేదని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

నెరవేరిన చెన్నూర్ ప్రజల కల

- చెన్నూర్ రెవెన్యూ డివిజన్, రెండు మండలాల ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గ ప్రజల కల నెరవేరింది. చెన్నూర్ రెవెన్యూ డివిజన్ డివిజన్‌తోపాటు అస్నాద, పారుపల్లి మండలాల ఏర్పాటుకు ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మందమర్రిలో జరిగిన బహిరంగ సభలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకులంగా స్పందిస్తూ హామీనిచ్చారు. వారం రోజులు కాక ముందే బుధవారం చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తోపాటు అస్నాద, పారుపల్లి మండలాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రైతులు భూ సమస్యలతోపాటు ఇతర అవసరాలకు మంచిర్యాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెన్నూర్ మండల వాసులు 40 నుంచి 60 కిలోమీటర్లు, కోటపల్లి మండల ప్రజలు 80 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. డివిజన్ ఏర్పాటుతో అన్ని రకాలగా ప్రయోజనం చేకూరనుంది.



చెన్నూర్‌లో బాణా సంచాలు కాలుస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

డివిజన్ మండలాలు ఇవే..

రెవెన్యూ డివిజన్‌లో చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాలతోపాటు కొత్తగా ఏర్పాటు కానున్న అస్నాద, పారుపల్లి మండలాలు రానున్నాయి. ఈ మండలాల ప్రజలు చెన్నూర్‌కు రావాలంటే 40 కిలోమీటర్ల దూరం ఉండడంతో దూరభారం తగ్గనుంది.

కొత్త మండలాలు ఇలా..

అస్నాద: అస్నాద, గంగారం, కోమ్మెర, పొక్కూర్, పొన్నారం, సోమన్‌పల్లి, నాగపూర్, బీరెల్లి, సుందరశాల, నర్సక్కపేట్, దుగ్నపల్లి.

పారుపల్లి: పారుపల్లి, ఆయాపల్లి, పుల్లగామ, సిర్సా, ఎదుల్లబంధం, లింగన్నపేట, ఆలుగామ, ఎర్రయిపేట, బొరంపల్లి, కావర్‌కొత్తపల్లి, అన్నారం, అర్జునగుట్ట, రాజారాం, రాంపూర్, కొల్లూర్, రాపన్‌పల్లి, దేవులవాడ, పిన్నారం, రొయ్యలపల్లి.

సంబరాలు

రెవెన్యూ డివిజన్, మండలాలు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడంపై చెన్నూర్ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బాణాసంచా కాచారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్ గిల్డా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించుకున్నాం..

చెన్నూర్ రెవెన్యూ డివిజన్‌తోపాటు రెండు కొత్త మండలాల ఏర్పాటు కోసం కృషి చేశా. ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన మాట.. ఇటీవల ఐటీ శాఖ మంత్రి హామీ ఇచ్చిన మేరకు ప్రజల కలను నెరవేర్చారు. నియోజకవర్గ అభివృద్దే నా లక్ష్యం. అభివృద్ధిలో భాగంగా ముందున్న చెన్నూర్ రెవెన్యూ డివిజన్ లక్ష్యాన్ని సాధించుకున్నాం.

– బాల్క సుమన్, ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే

గంగను చేన్లకు తెచ్చినం

- 50వేల ఎకరాలకు నీళ్లిస్తున్నం
- ఆయిల్‌పామ్‌తో రైతులకు లబ్ధి
- జిల్లాను మరింత అభివృద్ధి చేస్తాం
- నిర్మల్ పర్యటనలో మంత్రి కేటీఆర్
- మంత్రి అల్లోలతో కలిసి శంకుస్థాపనలు



నిర్మల్‌లో నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే జోగు రామన్న, బీఆర్ఎస్ నేతలు

నిర్మల్/దిలావర్‌పూర్/సోన్/నిర్మల్‌టౌన్: 'శ్రీలక్ష్మీ నర్సింహస్వామి పేరుమీద రూ.714కోట్లతో ఎత్తిపోతల పథకం ఇయ్యాల్ల ప్రారంభించుకున్నం. అక్కడ గుండంపల్లి పంప్‌హౌస్‌ల బటన్ ఒత్తినం.. ఇక్కడ డెలివరీ సిస్టర్న్ కాడికి మేం వచ్చేకంటే ముందే గోదారమ్మ వచ్చేసింది. గంగమ్మకు పూజచేసి, చీరెసారె పెట్టి.. అమ్మా మమ్మల్నందరినీ కూడా బ్రహ్మాండంగా చూసుకో.. దిలావర్‌పూర్, సారంగపూర్, నిర్మల్, మామడ, కుంటాల మండలాల్లో మొత్తం 50వేల ఎకరాలకు నీళ్లిచ్చే ఈ పథకంతో ఎప్పుడూ ఈప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని మొక్కుకున్నం..' అని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి బుధవారం జిల్లాలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నిర్మల్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. ముధోల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్సీ దండె విఠల్, నిర్మల్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్లు విజయలక్ష్మి, రాథోడ్ జనార్దన్, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థులు జాన్సన్ నాయక్, అనిల్‌జాదవ్, నాయకుడు పైడిపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికీ సస్యశ్యామలం

ఈ ప్రాంత రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కలను సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టుపట్టి పూర్తిచేయించారని తెలిపారు. ఒకప్పుడు ఎస్సారెస్పీ ఎండిపోయి రైతన్నకు కన్నీళ్లు మిగిలిస్తుండేనని, నీళ్ల కోసం కొట్లాటలు పెట్టిస్తుండేనని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ అపర భగీరథుడిలా కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రివర్స్ పంపింగ్ విధానంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నింపుతున్నారని చెప్పారు. ఇప్పుడు ఎస్సారెస్పీ సముద్రంలా కనిపిస్తోందని తెలిపారు. అక్కడి బ్యాక్‌వాటర్ నుంచి ఇప్పుడు లక్ష్మీనర్సింహస్వామి ఎత్తిపోతలతో గంగమ్మను రైతుల చేన్లకు తెచ్చుకున్నామని పేర్కొన్నారు. ఇక ఎప్పటికీ ఈ ప్రాంతం పచ్చని పంటలతో సస్యశ్యామలంగా ఉంటుందని తెలిపారు.



బహిరంగ సభకు హాజరైన జనం

భూముల ధరలు పెరిగినయ్..

గత ప్రభుత్వాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 14-15 ప్రాజెక్టుల పనులను పెండింగ్‌లో పెట్టాయని, వాటన్నింటినీ తొమ్మిదేళ్లలో పూర్తిచేశామని పేర్కొన్నారు. త్వరలోనే సదర్‌మాట్ ప్రాజెక్ట్ పూర్తవుతుందని తెలిపారు. ప్రాజెక్టులన్నీ పూర్తయి నీళ్లు అందుతుండటంతో పచ్చని పంటలు పండుతున్నాయన్నారు. గుట్టలపై భూములకూ ఎకరాకు రూ.20లక్షల నుంచి రూ.25లక్షల దాకా ధర పెరగడం సంతోషంగా ఉందని తెలిపారు. రైతుబంధుతో పాటు బీమాతో ధీమా ఇస్తున్న సర్కార్‌ను గుర్తించాలని కోరారు.

ఆయిల్‌పామ్‌కు డిమాండ్

దేశంలో 70శాతం మంది వాడే పామాయిల్‌ను ఇండోనేషియా, మలేషియా లాంటి దేశాల నుంచి తెచ్చుకుంటున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి భవిష్యత్‌లో ఉండకూడదన్న ఉద్దేశంతో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సోన్ మండలంలో రూ.300కోట్లతో ప్రియూనిక్ కంపెనీ ఆయిల్‌పామ్ కంపెనీ పెడుతోందని వివరించారు.

మాస్టర్‌ప్లాన్ మంచిగా చేసుకోవాలి

నిర్మల్ మాస్టర్‌ప్లాన్ గురించి కేటీఆర్ మాట్లాడుతూ.. గందరగోళంగా చేసుకున్నారని, అలా ఆగం కావొద్దని పేర్కొన్నారు. రెచ్చగొట్టేవాళ్లు ఉంటారని మంచిగా చేసుకోవాలని చెప్పారు. పట్టణమనేది మన కోసం కాదని, మన తర్వాత తరాలకూ ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.

ఇంద్రన్న ఏం తింటున్నవే..

'ఇంద్రకరణ్‌రెడ్డన్న మొన్న కడెం ప్రాజెక్ట్ కొట్టుకుపోతుందోనని బాధతో పోయి గేట్లు ఎత్తించిండు. నాకు 47ఏండ్లు, ఇంద్రన్నకు 74ఏండ్లు. అయినా నాకంటే ముందే ఉరుకుతున్నడు. అన్నం ఏం తింటున్నవే.. ఏం ఎక్సర్‌సైజులు చేస్తున్నవే అని అడుగుతున్న..' అని మంత్రి ఐకే రెడ్డి గురించి కేటీఆర్ అనడం సభికులను ఆకట్టుకుంది. 'ప్రజల కోసం పనిచేస్తున్నాన్న తృప్తి తనను నడిపిస్తోంది' అని ఇంద్రకరణన్న చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు.

అందరూ గంగన్నలు, గంగవ్వలే..

'ఈ ప్రాంతమంతా గంగన్నలు, గంగవ్వలే ఉంటరు. గోదావరి అంటేనే గంగమ్మ కాబట్టి ఇక్కడి ప్రాంతమంతా గంగమ్మ పేర్లే పెట్టుకుంటరు. మొత్తం మీద ఈ ప్రాంతంలో ఉండే గంగమ్మలు, గంగయ్యలందరికీ పేరు పేరునా ధన్యవాదాలు..' అంటూ సోన్ మండలం పాత పోచంపాడ్ శివారులో నిర్వహించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన సభలో కేటీఆర్ పేర్కొన్నారు. గంగమ్మ ఆశీస్సులతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందని తెలిపారు. సముద్రంలా కనిపిస్తున్న ఎస్సారెస్పీ గోదావరిని చూస్తుంటే సంబురమైందన్నారు.

మీవోళ్లు.. మంచోళ్లు..

'మీ జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలూ చాలా మంచోళ్లు, సల్లటి మనుషులు. మా ప్రజలు బాగుండాలని కోరుకునేటోళ్లు. ఇలాంటి ఇంద్రకరణన్న, విఠల్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలె. అలాగే నా మిత్రుడు జాన్సన్‌నాయక్‌ను ఖానాపూర్ ప్రజలు గెలిపించాలె..' అని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని ముఖరా(కె) గ్రామ ప్రజలు సీఎం కేసీఆర్‌కు, నాకు ఎన్నికల్లో నామినేషన్ల ఖర్చుకు పైసలిస్తమనడం సంతోషమని అన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి


అజయ్(ఫైల్)

జైపూర్: ఆగి ఉన్న లారీని ఢీకొని యువ సింగరేణి కార్మికుడు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... శ్రీరాంపూర్ ఆర్కే–6 కాలనీలోని హన్మాన్‌నగర్‌కు చెందిన చిలుముల ఓదెమ్మ–రాజేశం దంపతులకు ఇద్దరు కుమారులు. రాజేశం సింగరేణి కార్మికుడిగా పనిచేస్తూ ఏడాదిన్నర కిందట గుండెపోటుతో మరణించగా ఐదు నెలల కిందట తండ్రి ఉద్యోగం పెద్దకుమారుడైన అజయ్(24)కి వచ్చింది. రోజుమాదిగానే మంగళవారం రెండో షిఫ్ట్ డ్యూటీకి వెళ్లి బైక్‌పై గోదావరిఖని నుంచి శ్రీరాంపూర్ వస్తున్నాడు. ఇదే క్రమంలో టేకుమట్ల క్రాస్ రోడ్డు వద్ద నిలిపిన లారీని వెనక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి


చెండే నాగుమేర (ఫైల్)

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు చెండే నాగుమేర(94) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. చెండే నాగుమేర కొంత కాలంగా అరోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం స్థానిక జెడ్పీటీసీ సత్యనారాయణ, తహసీల్దార్ దత్తుప్రసాద్‌రావు, ఎస్సై నరేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు.

మహిళ అదృశ్యం

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామానికి చెందిన అగుమారె సుజాత అలియాస్ దివ్య అనే మహిళ అదృశ్యం అయినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. అగుమారె తిరుపతికి సుజాతకు 10సంవత్సరాల క్రితం వివాహం కాగా ఇద్దరు కుమారులున్నారు. వారం రోజులుగా దంపతుల మధ్యన గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 2వ తేదీన ఉదయం భర్త తిరుపతి నిద్ర లేచి చూడగా ఉదయం భార్య సుజాత ఇంటిలో కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో గుడిపేటవాసి ఎంపిక


అనూష

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన రాచమల్ల అనూష బుధవారం వెలుబడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. అనూషా తండ్రి పోచాగౌడ్ గీతా కార్మికుడు కాగా సత్తక్క గృహిణి. వీరి ముగ్గురుకు మార్తెల్లో అనూషా రెండవ సంతానం. నిరుపేద కుటుంబంలో జన్మించిన అనూషా ఇటు చదువుల్లోనూ అటు క్రీడల్లో రాణిస్తూ కానిస్టేబుల్ పరీక్షల్లోనూ సత్తా చాటింది. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలతో ముంచెత్తారు.

భూగర్భ గనులను కాపాడాలి

- ప్రజాభిప్రాయ సేకరణలో వక్తలు
- జీవిత కాలం పెంచే చర్యలు చేపట్టాలి
- నిధులను సింగరేణి ప్రాంతంలోనే ఖర్చు చేయాలి


సభలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మోతీలాల్


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: భూగర్భ గనులను కాపాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే న్యూటెక్ గనికి పర్యావరణ అనుమతుల కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో పునః ధ్రువీకరణ కింద ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, నిజామాబాద్ కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.లక్ష్మణ్ హాజరయ్యారు. సభకు హాజరైన వారి అభిప్రాయాలను సమోదు చేసుకున్నారు. చాలామంది వక్తలో సభలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. సింగరేణిలో భూగర్భ గనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, జీవితకాలం దగ్గరపడ్డ గనుల్లోని నిక్షేపాలను అన్వేషించి వెలికితీత ద్వారా జీవిత కాలం పెరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. భూగర్భ గనులతోనే ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, సింగరేణి గనుల వల్ల జరిగే కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత కంపెనీపై ఉందని, ఇందుకోసం మరిన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సింగరేణి సీఎస్‌ఆర్ నిధులు, శ్రీరాంపూర్ డీఎంఎఫ్‌టీ నిధులను సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోనే ఖర్చు చేయాలని, కానీ సింగరేణికి సంబంధం లేని ప్రాంతాలకు తరలించారని తెలిపారు. శ్రీరాంపూర్ ప్రాంతంలో ఆర్కే 6 గని పరిసరాల్లో సింగరేణి ప్రత్యేక శ్మశానవాటిక ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ నుంచి కే.సురేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ నుంచి ఎస్కే బాజీసైదా, ముస్కె సమ్మయ్య, ఐఎన్టీయూసీ నుంచి జే శంకర్‌రావు, బీఎంఎస్ నాయకులు పేరం రమేశ్, హెచ్ఎమ్మెస్ నేత తిప్పారపు సారయ్య, సీఐటీయూ నాయకులు భాగ్యరాజ్ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఎన్విరాన్‌మెంట్ జీఎం జీవీఎల్ గణపతి, ఏరియా ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్, ఓసీపీ పీఓలు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, ఏజెంట్లు రాముడు, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, ఏరియా ఎన్విరాన్‌మెంట్ హనుమాన్‌గౌడ్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు పరిష్కరిస్తాం..

సభలో వక్తలు పేర్కొన్న అభ్యంతరాలను పరిశీలించి కంపెనీ పరిధిలో ఉన్న వాటిని తప్పనిసరిగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. ఏరియా పరిధిలోని అంశాలను వెంటనే పరిష్కరిస్తాం. సింగరేణి అభివృద్ధి చెందితే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు పరిసర గ్రామాల్లో చేసుకొనే వీలుంది.

– బీ.సంజీవరెడ్డి, జీఎం, శ్రీరాంపూర్

ప్రభుత్వానికి నివేదిస్తాం

ఈ సభలో వక్తలు పేర్కొన్న అభ్యంతరాలు, సమస్యలను కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో రికార్డు చేయించడం జరిగింది. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. సింగరేణితోనే ఈ ప్రాంతంలో అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి సంస్థను కాపాడుకోవాలి.

– సబావత్ మోతీలాల్, జిల్లా అదనపు కలెక్టర్

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఉన్నతి శిక్షణలో వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీకాంత్


మాట్లాడుతున్న శాస్త్రవేత్త బి.శ్రీకాంత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉన్నతి శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త బి.శ్రీకాంత్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉన్నతి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతి, యువకులకు స్థిరమైన జీవనోపాధి కలిపించడమే లక్ష్యంగా ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్ సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సంస్థ ద్వారా ఈజీఎస్ కింద 100రోజుల పనిచేసుకున్న కుటుంబాల నుంచి 18–45 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతి, యువకులకు ఒక ఉద్యోగం కలిపించి ఆ కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నాన్ లోకల్ కేటగిరీలో ఉద్యోగ అవకాశాలు కలిపించడంతో పాటు అవసరమైన వారికి స్వయం ఉపాధి పొందేలా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, గ్రామ సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి, డీఆర్‌డీఏ నోడల్ అధికారి సదానందం, ఐకేపీ జేడీఎంలు సురేశ్, రాంచందర్, క్షేత్ర సహాయకులు స్వర్ణలత, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో విద్యార్థినికి గోల్డ్ మెడల్


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: జాతీయ స్థాయి యోగా పోటీల్లో బెల్లంపల్లికి చెందిన ఓ విద్యార్థిని గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటింది. గత నెల 30న యూత్, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్‌లో జాతీయ స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని డి.ఖుషి అండర్ –14 విభాగంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బంగారు పతకం గెలుచుకుంది. ఈ సందర్భంగా బుధవారం సదరు పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఖుషిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లోనూ యోగా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపల్ రాజారమేష్ పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుడి పాడె మోసిన ప్రభుత్వ విప్


పాడె మోస్తున్న ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్సీ

కోటపల్లి: మండలంలోని లింగన్నపేట గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్‌వీ తెలంగాణ విద్యార్థి నాయకుడు ఏరినాగుల మల్లికార్జున్ అనారోగ్యంతో మరణించగా పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిన అనంతరం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్కసుమన్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ పార్థివదేహం పాడె మోశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా వ్యవహరించిన మల్లికార్జున్ మృతిచెందడం తీవ్రంగా బాధించిందని తెలిపారు. మల్లికార్జున్ కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వ విప్ బాల్కసుమన్ హామీ ఇచ్చారు. మల్లికార్జున్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు నల్లాల ఓదెలు పరామర్శించారు.

పశువుల కాపరులపై అటవీశాఖ అధికారుల దాడి


బాధితులతో కలిసి మాట్లాడుతున్న గిరిజనులు

భీమారం: మండల కేంద్రం సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ మత్తడి వద్ద మంగళవారం సాయంత్రం పశువులను ఇళ్లకి తరలిస్తుండగా అటవీశాఖ అధికారి అల్తాఫ్ హుస్సేన్ బృందం పశువుల కాపరులైన లావుడియా శ్రీనివాస్, దేశం మల్లేశ్‌లపై దాడికి పాల్పడ్డాడు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన పశువులను మేత కోసం సమీపంలోని అడవికి తరలిస్తుంటామని, ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పశువులను అడవి నుంచి గొల్లవాగు ప్రాజెక్ట్ మీదుగా గ్రామానికి తరలిస్తుండగా సెక్షన్ అఫీసర్ అల్తాఫ్ హుస్సేన్ మరో ఐదుగురు సిబ్బంది అడ్డుపడి కర్రలతో చితకబాధారని అన్నారు. తాము తీసికెళ్లిన టిఫిన్ బాక్స్‌లు, సెల్ ఫోన్స్ లాక్కొని తనిఖీ చేశారని, పశువులను తీసుకువచ్చే సరికి రాత్రి కావడంతో విషయాన్ని తెలుపడం ఆలస్యమైందని, గ్రామానికి చెందిన ఎపశువులను ఎప్పటి నుంచో అడవికి మేతకోసం తీసుకువస్తున్నామని చెప్పినా పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టారని చెప్పారు. అకారణంగా దాడిచేసిన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తాం

భీమారంలో పశువుల కాపరులపై దాడి చేసిన అటవీశాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిచో ఆందోళనలు చేపడుతామని లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు బానోత్ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

– లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు

8న పీఎల్‌ఆర్ బోనస్‌పై సమావేశం

శ్రీరాంపూర్: బొగ్గుగని కార్మికులకు ప్రతీ సంవత్సరం చెల్లించే ప్రాఫిట్ లింక్డ్ రివార్డు (పీఎల్‌ఆర్) బోనస్‌పై ఈ నెల 8న న్యూఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. అక్కడి కోలిండియా కార్యాలయంలో ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు కోలిండియా యాజమాన్యం పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా జాతీయ సంఘాల ప్రతినిధులకు ఆహ్వానం పంపారు. ఈ బోనస్‌ను కోలిండియాలో దసరాకు ముందు, సింగరేణిలో దీపావళి పండుగకు ముందు చెల్లిస్తారు. క్రితం సంవత్సరం రూ. 76,500 చెల్లించారు.

చదువు చెప్పడం అభినందనీయం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

కాసిపేట: వృత్తి నైపుణ్య శిక్షణ పొందుతూ చదువు చెప్పడం అభినందనీయమని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ తెలిపారు. బుధవారం మండలంలోని దేవాపూర్‌లో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్టు సహకరంతో నిర్వహించిన వంద రోజుల కుట్టు శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు కుట్టు శిక్షణ నేర్చుకుంటూ వయోజనులకు చదువు చెప్పడం, అక్షర కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజనశాఖ ఇంచార్జి పురుషోత్తం నాయక్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గప్రసాద్, పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్టు గౌరవాధ్యక్షుడు రెడ్డిమల్ల ప్రకాశం, డీఆర్‌పీలు పోకల వెంకటేశ్వర్లు, బండ శాంకరీ, దేవాపూర్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ రమేష్, శిక్షణ కేంద్రం ట్రైనీ సంధ్యారాణి, అక్షర వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడే సంఘం ఏఐటీయూసీ


కాసిపేట 2గనిపై మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట: కార్మికుల హక్కుల కోసం ఎల్లప్పుడు పోరాడే సంఘం ఏఐటీయూసీనే అని ఎస్‌సీడబ్ల్యూ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. బుధవారం మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డు జీతాల పెరుగుదల సక్రమంగానే జరిగాయని, అనుభవం లేని కొంతమంది జీతాలు సక్రమంగా రాలేదని తప్పుడు ప్రచారంతో కార్మికులను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలు తెలుసుకుని వారి వెంట ఉండి హక్కుల కోసం పోరాడే ఏఐటీయూసీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి ఎండీ అక్బర్‌అలీ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, బ్రాంచి అధ్యక్షుడు బి.వెంకటస్వామి, నాయకులు దాసరి తిరుపతి, గొల్ల శ్రీనివాస్, బొద్దుల వెంకటేష్, తీర్థాల చెంద్రయ్య, కొత్తపల్లి నర్సయ్య, గోదారుల లింగమూర్తి ఉన్నారు.

ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పని చేసే కాంట్రాక్టు కార్మికులందరూ ఐక్య పోరాటాలతో హక్కుల సాధనకు పోరాడాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. బుదవారం గోలేటి సీహెచ్‌పీలో కాంట్రాక్టు కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికుల వేతనాల జీవోలను సవరించకుండా కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికుల హక్కుల సాధనకు శుక్రవారం శ్రీరాంపూర్‌లో నిర్వహించే మహా ధర్నాకు ఏరియాలోని కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. శ్రీరాంపూర్‌లో చేపట్టే మహాధర్నాకు అన్ని విభాగాల్లో పని చేసే కాంట్రాక్టు కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ టికెట్ స్థానికులకే కేటాయించాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంగ్రెస్ టికెట్‌ను అధిష్టానం స్థానికులకే కేటాయించాలని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ కె.ఉదయ్‌కాంత్, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొడ్డ శారద, కాంగ్రెస్ అంసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి కోరారు. బుధవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. తండ్రి తాతల పేర్లు చెప్పుకుంటే ఎన్నికల్లో గెలువలేరని పరోక్షంగా మారో కాంగ్రెస్ నాయకుడిని ఉద్దేశించి మాట్లాడారు. అలాంటి నాయకులకు టికెట్ కేటాయిస్తే ఓడిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జయరాం, పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ, సహకార సంఘం వైస్ చైర్మన్ కంకటి శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు ఎం.సరోజ, నాయకులు ఆర్.శ్యామ్, టి.మల్లేష్, మహేష్ పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా ఉద్యోగ సంఘాలు


మద్దతు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉద్యోగ భద్రత, పేస్కేల్ కోసం సమ్మెబాట పట్టిన డీపీఎంలు, ఈ–పంచాయతీ ఆపరేటర్లు నిరసనను రోజురోజుకూ ఉధృతం చేస్తున్నారు. వారు చేపట్టిన సమ్మె బుధవారం 6వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న డీపీఎం, ఈ–పంచాయతీ ఆపరేటర్లకు మద్దతుగా తెలంగాణ ఉద్యోగుల సంఘం, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ వారి న్యాయమైన సమస్యల సాధనలో వెన్నంటి ఉంటామన్నారు. ఉద్యోగ భద్రత లేక అవస్థ పడుతున్న వారికి వెంటనే పేస్కేల్, జాబ్ గ్యారంటీ ఇవ్వాలన్నారు. మద్దతు తెలిపిన వారిలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాలకిషన్‌రావు, ప్రధాన కార్యదర్శి గౌతమ్, జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, శ్రీనివాస్, వేణుగోపాల్, ఉద్యోగులు మనోహర్, శ్రీధర్, రాజు, రామకృష్ణ, తెలంగాణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, స్టేట్ కో ఆర్డినేటర్ నాందేవ్, డీపీఎం దాసరి నరేందర్, ఈ–పంచాయతీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల నిరసన


ఎంఈవోకు విన్నవిస్తున్న ఉద్యోగులు

మంచిర్యాలఅర్బన్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లోని సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో కేజీబీవీలో విధులు నిర్వహిస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు బుధవారం డీఈవో కార్యాలయం ముట్టడించారు. సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజ్ చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం డీఈవో కార్యాలయంలో అందజేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామన్నారు. కేజీబీవీల్లో విధులు నిర్వహించే టీచింగ్ నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఒక్కసారిగా విధులు బహిష్కరించి ఆందోళన చేయటంతో స్పెషల్ ఆఫీసర్లు ఒక్కరే అన్నీతానై పనులు చక్కదిద్దుకోవాల్సి వచ్చింది. పదుల సంఖ్యలో ఉద్యోగులు విధులు నిర్వహించే చోట ఎస్‌వో ఒక్కరే విధులు నిర్వహించటం కష్టంగా ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

బ్యాడ్మింటన్ పోటీల్లో అదర్స్ జట్టు గెలుపు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఏరియా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా టీవైసీఎంవో నాగేశ్వర్‌రావు హాజరై ప్రారంభించారు. ఈ పోటీల్లో అదర్స్ జట్టు గెలుపొందగా కేకే గ్రూప్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి కార్తీక్, కో–ఆర్డినేటర్ రవికుమార్, బాల్ బ్యాట్‌మెంటన్ క్యాప్టన్ శ్రీధర్, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీలో లొల్లి

- నాణ్యమైనవి పంపిణీ చేయాలన్న కాంగ్రెస్
- బాగానే ఉన్నాయన్నా బీఆర్‌ఎస్
- ఎమ్మెల్యే సాక్షిగా నాయకుల వాగ్వాదం


ఎమ్మెల్యే సాక్షిగా ఇరుపార్టీల నాయకుల వాగ్వాదం..

దండేపల్లి: మండల కేంద్రంలో బుధవారం చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ రసాభాసగా మారింది. ఎమ్మెల్యే దివాకర్‌రావు సాక్షిగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చీరలు నాణ్యతగా ఉంటే బాగుంటుంది, ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాన్నారు. అక్కడే ఉన్న పలువురు బీఆర్‌ఎస్ నాయకులు జోక్యం చేసుకుంటూ గత ఏడాది ఎంపీపీగా ఉన్నప్పుడు ఏం మాట్లాడావు. ఇప్పుడు పార్టీ మారి ఇలా మాట్లాడుతున్నావ్, చీరలకు ఏమైందని ప్రశ్నించారు. దీంతో ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు ఇరుపార్టీల వారిని తోసివేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, జెడ్పీటీసీ నాగరాణి, వైస్ఎంపీపీ అనిల్, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, ఎంపీటీసీలు శ్రీనివాస్, మోహన్, ఉపసర్పంచ్ భూమన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సత్యం, వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైడ్ డ్రైన్ పనులకు భూమిపూజ..

దండేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం, గాంధీ విగ్రహం సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన రూ.47.1 లక్షల ఆర్అండ్‌బీ నిధులతో 600 మీటర్ల పొడవుతో చేపట్టే సైడ్ డ్రైన్ పనులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు భూమి పూజ చేశారు. ఇక్కడ కూడా ఎంపీపీ శ్రీనివాస్ బీఆర్‌ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సీఐ కృష్ణ, ఎస్సైలు ప్రసాద్, లక్ష్మణ్‌లు ఇరుపార్టీల వారికి నచ్చజెప్పి పంపించారు. ఈ కార్యక్రమాలకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమస్యలపై పోరాడితే అక్రమ అరెస్టులా?


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో మహాధర్నాకు వెళ్తున్న అంగన్‌వాడీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులు న్యాయమైన సమస్యలు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ, జీతంలో సగం పింఛన్, ఈఎఫ్ఐ, రూ.10లక్షల ప్రమాద బీమా తదితర సమస్యలు పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా సమ్మె చేపడుతున్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ మహాధర్నాకు బుధవారం తెల్లవారుజామున వెళ్తున్న అంగన్‌వాడీలను రెల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఇంటి నుంచి బయలుదేరుతుండగా అరెస్టు చేశారన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, రఫియా, పోసక్క, తిరుపతి, నారాయణ పాల్గొన్నారు.